

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**అన్నయ్య ఇంట్లో** ఉదయం లేచాను కానీ ఇండియానాలో ఉన్నట్టే అనిపించింది. అన్నయ్య ఇంకా లేవకపోవడంతో నేను గదిలోనే ఉన్నాను. స్నానం గట్రా పూర్తిచేసి తలుపు ఓరగా తెరిచాను, కానీ అన్నయ్య గాఢ నిద్రలో ఉన్నాడు. ఫ్రెండ్స్‌కి ఫోన్‌లో మెసేజ్ చేసాను. ఇండియాలో ఉన్న ఫ్రెండ్స్‌తో కాలక్షేపం చేసాను. కొంతమంది తల్లిదండ్రులు పెళ్ళిచేసుకోమని పేచీ చేస్తున్నారట.

స్వర ఫోన్ చేసి "అమెరికాకి వెళ్ళి మంచి పని చేసావు. ఇక్కడే ఉంటే మీ పేరెంట్స్ కూడా ఇలానే చేసేవాళ్ళు" అంది.

నిజానికి నాకు కేంపస్ ప్లేస్ మెంట్ రావడం వల్ల ఇండియాలోనే ఉండిపోయినా, ఉద్యోగం చేయడంవల్ల మా అమ్మ నన్ను వత్తిడి చేసేదికాదు. కానీ స్వరని ఎందుకు కించపరచాలి అని "ఔను. ఏమంటున్నారు ఆంటీ?" అడిగాను.

"మొన్న ఇంటికి ఎవరో వస్తున్నారు అంది 'ఎవరో' అనుకున్నాను. కానీ వచ్చింది పెళ్ళివారు."

"ఓ. నీకు ముందు చెప్తే ఒప్పుకోవని చెప్పలేదేమో?"

"వారం ముందు షాపింగ్‌కి వెళ్ళాము. 15వేల చీర నచ్చింది అంటే కొనిచ్చింది. అంత ఖరీదు చీర కొన్నప్పుడే నేను ఊహించాల్సింది."

"అసలు చీరల షాపింగ్‌కి ఎందుకు వెళ్ళావు?"

"బుద్ధి తక్కువై 'మొన్న కొనుక్కున్న చీర కట్టుకో ' అంటే ఎందుకు అని అడక్కుండా ఎగిరి గంతేసాను."

నవ్వాను.

"ఆ అబ్బాయి వాళ్ళు వచ్చినప్పుడు కూడా తెలీలేదు. ఎవరో దూరపు బంధువులనుకున్నాను"

"మరి ఎలా తెలిసింది? తరవాత ఆంటీ చెప్పారా?"

"లేదు. సినిమాల్లో చూపించినట్టు 'విడిగా మాట్లాడాలి ' అన్నాడు అబ్బాయి."

"అలా రియల్‌గా చేస్తారా?" ఆశ్చర్యపోయాను.

"కంపరం పుట్టింది ఇంక. అక్కర్లేదు ఇక్కడే మాట్లాడు అన్నాను."

"అయితే నీకు ఇష్టంలేదని అర్ధమై ఉండాలి."

"అంత సీన్ లేదు 'అమ్మాయి సిగ్గు పడుతుంది' అని వాళ్ళ అమ్మ, మా అమ్మా నవ్వారు. చిరాకు సీన్స్."

"అయ్యో. ఏం చేసావయితే?"

"చచ్చినట్టు బయటకి వెళ్ళాము. మేడమీదకి వెళ్దాం అంటే ఇది సినిమా కాదు అన్నాను"

"నిజంగా అన్నావా?" ఆశ్చర్యపోయాను.

"యా. అసలైతే గెట్ ఔట్ అవాలనిపించింది."

"ఏమన్నాడు అయితే?"

"ఉత్త తలుపు నుంచి గేట్ వరకు, గేట్ నుంచి తలుపు వరకు నడిచాడు. నేనూ నడుస్తా అనుకున్నాడేమో కానీ బయట కుర్చీలో కూర్చుండిపోయాను. తను వచ్చి కూర్చున్నాడు. తరువాత అస్సలు మాట్లాడలేదు తెలుసా?"

"అదేంటి?"

"ఏమో మరి. ఉత్త కాళ్ళు చూసుకుంటూ ఉండిపోయాడు. ఎండ ఎక్కువౌతుంది. లోపలికి వెళ్దాం అన్నాను. సీరియస్‌గా చూసి 'ఈ పెళ్ళి ఇష్టంలేదా' అన్నాడు"

"యా.. ఇష్టంలేదు అనాల్సింది."

"అంతే అన్నాను, మీ పేరెంట్స్‌తో నువు నాకు నచ్చలేదని చెప్తా" అన్నాడు.

"ఎందుకు? నువ్వే నాకు నచ్చలేదు. నేనే చెప్తా అన్నాను. షాక్ అయ్యాడు."

"ఎందుకు?"

"ఏమో. సినిమాలు చూసి అమ్మాయిలు రిజెక్ట్ చెయ్యలేరనుకున్నాడేమో"

"తరువాత ఏమైంది?"

"లోపలికి వెళ్ళగానే నా రూములోకి వెళ్ళిపోయాను. కొద్దిసేపటికి వాళ్ళు వెళ్ళిపోయారు. మా అమ్మకి చెప్పా, ఇంకోసారి ఇలాంటివి చేస్తే ఇంట్లోంచి పారిపోతాను" అని.

"ఏమన్నారు?"

"మంచి సంబంధం, అదీ ఇదీ నాన్‌సెన్స్ క్లాస్ పీకింది."

"నువ్వేం చేసావ్?"

"ఫోన్‌లో గేం ఆడుకుంటూ కూర్చున్నా."

ఇంతలో బయట చప్పుడైంది.

"మా అన్నయ్య లేచాడు. నీకు మళ్ళీ చేస్తా" అని ఫోన్ పెట్టే సి వెళ్ళాను.

"గుడ్ మార్నింగ్" అన్నయ్యకి చెప్పాను.

"ఇంత పొద్దున్నే లేచేసావా?" ఆవులిస్తూ అడిగాడు.

"పొద్దున్నే కాదు మధ్యాహ్నమైంది" అన్నాను.

"మధ్యాహ్నమా?" ఉలిక్కిపడి టైం చూసాడు, "ఒసేయ్ ఇంకా 11కూడా అవలేదు"

"ఔనా అయితే ఆల్మోస్ట్ మధ్యాహ్నం అన్నాను."

ఇద్దరం నవ్వాము.

"స్నానం చేసివస్తా" బద్ధకంగా తన గదిలోకి వెళ్ళాడు.

ఈలోపు ఆకలవ్వడం వల్ల వెంటనే ఉప్మా వండడం ప్రారంభించాను. అన్నయ్య ఫ్రోజెన్ వెజిటబుల్స్ ఎక్కువ వాడడం వల్ల వంట ఫటఫటా అయిపోయింది. అన్నయ్య కోసం ఆగుదామని టీవీ ఆన్ చేసాను. ఇది వరకు చూసిన 'వన్స్ అపాన్ ఎ టైం' చూడ్డం మొదలుపెట్టాను. ఒక ఎపిసోడ్ సగం అయ్యేసరికి అన్నయ్య వచ్చి "ఏంటి? ఏదో ఘుమఘుమల వాసన వస్తుంది?" అడిగాడు.

"ఉప్మా చేసాను. స్నానం అప్పుడే అయిపోయిందా?" అడిగాను.

"లేదు. నీ ఉప్మా వాసనకి సగంలో వచ్చేసాను" ఎగతాళి చేసాడు.

"తిందామా?"

"అప్పుడేనా? నేను ఇందకే లేచాను కదా!"

"ఫరవాలేదు. కొంచెం తిను. నీ కోసం వెయిట్ చేస్తున్నా."

"నేను కాఫీ తాగుతూ కంపెనీ ఇస్తాలే"

ఆకలివల్ల బ్రతిమలాడకుండా తినడం మొదలు పెట్టాను.

"ఏం చూస్తున్నావు?" అన్నయ్య అడిగాడు.

కథంతా చెప్పాను. పెద్దగా నవ్వి "ఈ చిన్న పిల్లలది ఎన్ని రోజులు చూస్తావింకా?" అడిగాడు.

"చిన్న పిల్లలవి కార్టూన్స్. ఇది పెద్ద పిల్లలదే" నాలుక బయటపెట్టి ఎక్కిరించాను.

"తిన్నాక రెడీ అవ్వు. బయటకి వెళ్దాం" అన్నాడు.

"ఎక్కడికి?"

"షాపింగ్."

"షాపింగా? నువ్వేమన్నా అమ్మాయా?" మళ్ళీ ఎక్కిరించాను.

"నాకు కాదే, నీకు"

"ముందే చెపితే బట్టలు తెచ్చేదాన్ని కాదుకదా. ఇప్పుడు సూట్ కేసులో ప్లేస్ ఎక్కువలేదు."

"బానే ఆశలున్నాయే నీకు" నవ్వాడు.

నేను బదులివ్వకుండా గబగబా తయారయ్యాను.

ఇద్దరం కలిసి మాల్ కాక ఏదో షాప్‌కి వెళ్ళాము.

"అదేంటి? ఇలా ఉన్నాయి?" ఆశ్చర్యపోయాను.

"స్కీ సూట్స్ ఇలానే ఉంటాయి"

"నాకు నచ్చలేదు. వేరే చోటుకి వెళ్దాం"

"ఎక్కడైనా ఇలానే ఉంటాయి"

ఒక ఎరుపు రంగుది అన్నయ్య చేతికిచ్చాను.

"ఇది వేసుకుంటే కొట్టొచ్చినట్టు కనపడతావు. కాస్త లైట్ కలర్ తీసుకో" అన్నాడు.

ఎన్ని చూపిచ్చినా అన్నిటికీ వంకలు పెట్టసాగాడు. తను చూపించేవి నాకు అస్సలు నచ్చలేదు. చివరికి సహనం కోల్పోయి "క్లాసుకి వెళ్ళేది నేనా? నువ్వా? నా ఫ్రెండ్స్ అందరూ నవ్వుతారు" కోప్పడ్డాను.

"క్లాసేంటి?" ఓ సెకెండు తరువాత "ఓ, ఇది క్లాసుకేసుకుని వెళ్తావా?" అడిగాడు.

"మరి స్నోలో నడిచేది నేనేగా."

పెద్దగా నవ్వి "అయ్యో చిట్టి, ఇది క్లాసుకో, పార్కుకో కాదు కేవలం స్కీయింగ్‌కి వేసుకోవాలి. స్కీయింగ్ అంటే తెలుసా?"

"ఆ తెలుసులే" చిన్నబోయాను.

అన్నయ్య మొదట చూపించిన వైట్‌ది తీసుకుని "ఈ రంగు ఓకే" చెప్పాను.

కారులో కూడా అన్నయ్య నవ్వుతూనే ఉన్నాడు. కొద్దిసేపటికి నేనూ నవ్వాను.

తను ఫోనులో కొన్ని స్కీయింగ్ వీడియోలు చూడమని నా చేతికి ఇచ్చాడు. అవి చూసిన నేను ఎంతో ఆతృతగా వెయిట్ చేసాను. స్కీ రిసార్ట్‌లో ఆగగానే అక్కడ జనాలని చూసి కాస్త ఆశ్చర్యపోయాను.

"మంచులో ఇంతమంది ఉన్నారేంటి?" అడిగాను.

"అందరూ స్కీయింగ్‌కి వచిన వారే, కొలారాడోకి వేరే ఊళ్ళనుండి కూడా వస్తారు స్కీయింగ్ కోసం"

"నాలాగా" నవ్వాను.

ఎలా స్కీయింగ్ చెయ్యాలో అన్నయ్య చూపించాడు. నేను అనుకున్నంత సులువుగా లేదు. ఒక పదిహేను నిమిషాలు అన్నయ్య ధైర్యం చెప్పాడు. కాస్త ప్రాక్టీస్ చేసాక  కాన్ఫిడెన్స్ పెరిగింది. ఇంతలో ఓకాలు తూర్పు, ఓ కాలు పడమరకి వెళ్ళి కింద పడ్డాను. ఓ రెండు క్షణాలు నా మెదడు పనిచెయ్యలేదు. చుట్టుపక్కల వాళ్ళలో కొంతమంది నాకు తెలీకుండా నవ్వే ప్రయత్నం చేసారు, మరి కొందరు "ఆర్ యూ ఓకే" అంటూ సహాయం చెయ్యడానికి వచ్చారు. అన్నయ్య మాత్రం పక్కన నవ్వుతూ ఫోన్‌లో రికార్డ్ చేసాడు. కోపం రావాలి కానీ నేనూ నవ్వాను. అన్నయ్య చెప్పిన చిట్కాలు పాటిస్తూ, చిన్నగా, పడిపోకుండా చాలాసేపు స్కీయింగ్ చేసాను. అన్నయ్యతో రకరకాల ఫోటోలు తీయించాను. తను ఎన్నిసార్లు "వెళ్దామా" అన్నా నేను "ఇంకాసేపువుందాం" అనే అన్నాను.

చివరికి కాస్త ఎండ వచ్చి జనాలు కూడా ఎక్కువయ్యాక "ఆకలిగా ఉందే, పదా" అన్నాడు. ఇద్దరం అక్కడే ఉన్న రెస్టారెంట్‌లో బయట కూర్చుని అక్కడ స్కీ చేస్తున్న వారిని చూస్తూ భోంచేసి తిరిగి స్కీయింగ్ చేద్దామ అనుకున్నాం కానీ నా చేతులు, కాళ్ళూ అలిసిపోయాయని వేడీ టీ తాగిన తరవాత అర్ధమై ఇంక వద్దని చెప్పాను. అక్కడే కాస్త కాలక్షేపం చేసి ఇంటికి బయలుదేరాము.

"నచ్చిందా?" ఇంటికి వెళ్ళగానే అడిగాడు.

"చాలా, చాలా, చాలా నచ్చింది" అన్నాను.

"నువ్వు వెళ్ళేలోపు మరోసారి వెళ్దాములే" అన్నాడు.

"సరే. నేను కొంచెంసేపు పడుకుని లేస్తా" గదిలోకి వెళ్ళాను.

"సరే, నేను ఆఫీస్ వర్క్ చేసుకుంటాను" అన్నాడు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story